

రూ.72 కోట్లు రుణాలిచ్చేందుకు లక్ష్యం

ప్రజాశక్తి - వీరఘట్టం

జిల్లాలో ఈ ఏడాది స్త్రీనిధి ద్వారా రూ.72 కోట్లు రుణాలు ఇచ్చేందుకు లక్ష్యం పెట్టుకున్నామని స్త్రీ నిధి ఎజిఎం కె.హేమలత తెలిపారు. మంగళవారం స్థానిక మండల మహిళా సమైక్య కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో ఇప్పటివరకు రూ19.5 కోట్లు రుణాలు ఇవ్వగా, 48శాతం వసూలు చేసినట్లు తెలిపారు. 35 గ్రామ సంఘాల ద్వారా 250 ఎస్‌హెచ్‌జి గ్రూపుల నుండి రూ.కోటి50 లక్షల వరకు మొండి బకాయి ఉండేదని, రూ.99.65 లక్షలకు బకాయి రావాల్సి ఉందని అన్నారు. ఈ నిధికి సంబంధించి 93శాతం వసూలు చేయాల్సి ఉందని స్పష్టం చేశారు. బలిజిపేట, పాచిపెంట, సీతంపేట, భామిని మండలాల్లో బకాయిలు ఎక్కువగా రావాల్సి ఉందన్నారు. బకాయిలు వసూలు చేసేందుకు బృందాలు కూడా ఏర్పాటు చేశామని తెలిపారు. అనంతరం సిసిలతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎపిఎం బి.శివన్నాయుడు, సిసిలు పాల్గొన్నారు.



జ్వరంతో బాధపడుతున్న గిరిజనుడు

మంచానపడ్డ మడవలస

ఇంటింటా జ్వర పీడితులే
సమాచారం ఇచ్చినా పట్టించుకోలేదు : గిరిజనులు

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని దెబ్బగెడ్డ పంచాయతీ మడవలస గిరిజనులు వారం రోజులుగా జ్వరంతో బాధపడుతున్నారు. ఆ వైద్య సిబ్బందికి సమాచారం ఇచ్చిన కనీసం పట్టించుకోవడం లేదని ఆ గ్రామస్తులు వాపోతున్నారు. సుమారు 18 కుటుంబాల్లో 70 మంది వరకు ప్రజలు నివసిస్తున్నారు. జ్వరం, జలుబు, నీరసం, శరీరం నొప్పితో వీరంతా బాధపడుతున్నారు. కాస్త స్థోమత కలిగిన వారు పట్టణ ప్రాంతాలకు వైద్యం కోసం తరలిపోగా, ఆర్థికస్థోమత లేనివారంతా ఇళ్ల వద్ద మంచాల మీదే మూలుగుతున్నారు. ప్రస్తుతం గ్రామంలో మెలిక నర్సింగరావు, రోహిత్, కార్తీక్, అన్నమ్మ, తీటమ్మ, రవి, శ్రీరాము, మోసే, యూన్సీ, సున్న తదితరులు జ్వరంతో బాధపడుతున్నారు. అలాగే సోడిపల్లి బిట్టు, సింగారమ్మ, బూతమ్మలు వైద్యం కోసం పట్టణాలకు వెళ్లిపోయారు. శంబర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం దూరం కావడంతో ఇబ్బందులు తప్పడం లేదని గిరిజనులు వాపోతున్నారు. 104 వాహనం వచ్చి సమాచారం ఇచ్చినా మందులు లేవంటూ సమాధానం ఇచ్చారని గ్రామ పెద్ద మిళ్లికి రవి ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అలాగే పలుమార్లు స్థానిక సిబ్బందికి సమాచారం ఇచ్చినా కనీసం పట్టించుకోలేదని సూడిపల్లి బిట్టు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి వైద్య సేవలు అందించాలని స్థానికులు కోరుతున్నారు. అయితే ఎట్టకేలకు మంగళవారం సాయంత్రం వైద్యశిబిరం నిర్వహించి గ్రామస్తులకు వైద్య సేవలందించారు.

ప్రజల వద్దకే వైద్యసేవలంటూ ఒకవైపు ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తుండగా, మరోవైపున గిరిజన గ్రామాల్లో ప్రజలు జ్వరాలతో మూలుగుతున్నారు. దీంతో ప్రభుత్వం చేస్తున్న ఆర్భాటపు ప్రచారానికి గిరిజన గ్రామాల్లోని పరిస్థితికి పొంతన ఉండడంలేదు. ఇందుకు నిదర్శనం మండలంలోని మడవలస గిరిజన గ్రామమంతా మంచాన పడింది

సురక్ష సర్వేలో బిజీగా ఉన్నందున...

ప్రస్తుతం జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేలో వైద్య సిబ్బంది అంతా బిజీగా ఉన్నారని, అందువల్లే గ్రామానికి చేరుకోలేకపోయారని శంబర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రఘు కుమార్ ప్రజాశక్తికి తెలిపారు. గ్రామంలోకి వైద్య సిబ్బందిని పంపి పరీక్షలు నిర్వహించి, మందులు అందజేస్తామని ఆయన అన్నారు.

సకాలంలో వైద్యమందక వ్యక్తి మృతి

ప్రజాశక్తి - గరుగుబిల్లి

గరుగుబిల్లి పంచాయతీ హిక్కింవలస గ్రామానికి చెందిన వ్యక్తికి సకాలంలో వైద్య సేవలందక పోవడంతో మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. హిక్కింవలస గ్రామానికి చెందిన జాగాన బలరాము నాయుడు మంగళవారం ఉదయం వరి పంటకు యూరియాను వేసేందుకు వెళ్లారు. తిరిగి ఇంటికి వస్తున్న సమయంలో స్పృహతప్పి పడిపోవడంతో కుటుంబీకులు, గ్రామస్తులు హుటాహుటిన ఆటోతో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చికిత్స నిమిత్తం తరలించారు. అయితే ఆ సమయంలో పిహెచ్‌సికి చెందిన ఇద్దరు వైద్యులు గొట్టివలసలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంకు హాజరయ్యారు. ఆ సమయంలో పిహెచ్‌సిలో విధులు నిర్వహిస్తున్న ఎఎన్‌ఎం వైద్యం చేసేందుకు నిరాకరించిన పార్వతీపురం ఏరియా ఆసుపత్రికి తీసుకువెళ్లాలని సూచించారు. అయితే పరిస్థితి విషమించడంతో ప్రథమ చికిత్స చేయాలని పలువురు ఆగ్రహం వ్యక్తం చేయడంతో వైద్య సేవలందించినట్లు తెలిపారు. ఆక్సిజన్ పెట్టాలని కోరినప్పటికీ ఆక్సిజన్ పెట్టలేదని అలా అయితే బతికే వాడేమోనని పేర్కొన్నారు. ఏది ఏమైనప్పటికీ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో కనీసం ఒక వైద్యాధికారైనాలేకపోవడం వల్ల నిండుప్రాణం బలైందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు

బిజెపి నిరంకుశ పాలనకు నిరసనగా
రైతు, కార్మికసంఘాల ఆందోళన



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న కార్మికసంఘాల నాయకులు

ప్రజాశక్తి - బెలగాం/సాలూరు/బలిజిపేట/పాలకొండ

కేంద్రంలోని బిజెపి నిరంకుశ పాలనకు నిరసనగా ఎస్‌కెఎం, కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ వద్ద, సాలూరు, పాలకొండ, బలిజిపేటలో ధర్నా జరిగింది. దేశంలో రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించేలా కేంద్ర ప్రభుత్వం చట్టం చేయాలని, ఉత్తరప్రదేశ్‌లో నలుగురు రైతుల హత్యకు కారణమైన కేంద్ర సహా హోం మంత్రి కుమారుడును శిక్షించి, మంత్రిని కేంద్ర మంత్రి మండలి నుంచి సస్పెండ్ చేయాలని, డిమాండ్ చేస్తూ, ఈనెల3న బ్లాక్ డేగా పాటిస్తూ, కేంద్ర కిసాన్ మోర్చా కార్మిక సంఘాలు ఈరోజు పిలుపులో భాగంగా కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్లకు వరాలు ప్రకటించి, రైతాంగానికి నోట్లో మట్టి కొట్టాలని చూస్తే పుట్టగతులు ఉండవని హెచ్చరించారు. 385 రోజులు దేశమంతా చుట్టుముట్టి, ఢిల్లీ వేదికగా రైతాంగం పోరాడారని, ఇవేవీ కేంద్ర ప్రభుత్వానికి కనిపించడం లేదని, దేశానికి అన్నం పెట్టే రైతాంగ ప్రయోజనాలు కన్నా, ప్రధాని మోడీకి అదానీ, అంబానీల ప్రయోజనాలే ముఖ్యంగా కనిపిస్తున్నాయని విమర్శించారు. రైతు కొనుకూల చట్టాలు చేయనందుకే, నేడు బ్లాక్‌డేగా నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో రైతు నాయకులు రెడ్డి లక్ష్మణనాయుడు, రైతు కూలీ సంఘం సహాయకార్యదర్శి ఎం.భాస్కరరావు, ఎపి రైతు సంఘం నాయకులు కె.రామినాయుడు, వి.సంఘం, ఆర్.ఈశ్వరరావు, సిఐటియు జిల్లా కోశాధికారి జి.వెంకటరమణ, నాయకులు బి.సూరిబాబు, కె.సింహచలం, తదితరులు పాల్గొన్నారు. **సాలూరురూరల్ :** కేంద్ర కిసాన్ మోర్చా కార్మిక సంఘాలు ఈరోజు పిలుపులో భాగంగా మండలంలోని తోణాంలో నిరసన కార్యక్రమం జరిగింది. సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్వై నాయుడు ఆధ్వర్యాన జరిగిన ఆందోళనలో రైతు నాయకులు కోనేటి శుభ, కృష్ణ, సుబ్బారావు, సింహాచలం పాల్గొన్నారు. **పాలకొండ :** స్థానిక రెవెన్యూ డివిజన్ కార్యాలయం ఆవరణం వద్ద సంయుక్త కిసాన్ మోర్చా-కార్మిక సంఘాల ఆధ్వర్యంలో బ్లాక్‌డే నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘాల సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ బంటు దాసు, సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు, అఖిలభారత రైతు సీనియర్ రైతు సంఘ నాయకులు బిండా ప్రసాద్ రావు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు దూసి దుర్గారావు మాట్లాడారు. కార్యక్రమంలో భవనిర్మాణ కార్మిక సంఘం ప్రతినిధి పెదగాడ రమణ, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం ప్రతినిధులు మునుకోటి అప్పన్న, వారాడ గోవిందరావు, మజ్జి వీరానాయుడు, సిహెచ్ సంజీవి, బి.పట్నాకి, బంటు శివన్నాయుడు, గౌరినాయుడు, కూర్మారావు, సింహాచలం, గొట్టాపు కృష్ణారావు, శంకరరావు పాల్గొన్నారు. **కొమరాడ :** సంయుక్త కిసాన్ మోర్చా , రైతు, కార్మిక సంఘాలపిలుపు మేరకు స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజ్ సెంటర్ వద్ద రైతు సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేశారు. ఈ నిరసన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు ఏ ఉపేంద్ర మాట్లాడారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ కొల్లి సాంబమూర్తి, వ్యవసాయ కార్మిక సంఘం, గిరిజన సంఘం మండల నాయకులు రైతులు కార్మికులు పాల్గొన్నారు. **బలిజిపేట :** ప్రజా సంఘాల ఆధ్వర్యంలో బలిజిపేట మహాత్మా గాంధీ విగ్రహం దగ్గర నల్ల జెండాలతో నిరసన తెలిపారు. కార్యక్రమంలో కార్మిక సంఘాలు, రైతు, కౌలు రైతు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు గేదెలు సత్యనారాయణ సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మధరావు, రైతు కూలి సంఘం నాయకులు మామిడి సింహాద్రి నాయుడు, సిఐటియు రాజు, సత్యం, శ్రీను, వివిధ ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు



బలిజిపేట : గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న సంఘాల నాయకులు

9న ఐటిఐలో ప్రవేశానికి ఐదో విడత కౌన్సిలింగ్

సీతంపేట : స్థానిక ప్రభుత్వ ఐటిఐలో మిగిలి ఉన్న సీట్లకు ఐదో విడత కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ ఎం.గోపాలకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. Iti ap.gov .in వెబ్ సైట్‌లో ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈనెల 8లోగా దరఖాస్తు నమోదు చేసుకోవాలని తెలిపారు. మిగిలినవి డ్రెస్ మేకింగ్ సీట్లు ఉన్నట్లు తెలిపారు.



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు రామ్మోహన్

సమస్యల పరిష్కారంపై చిత్తశుద్ధి లేని ప్రభుత్వం

ఎస్ఎఫ్ఐ సైకిల్ యాత్రలో రాష్ట్ర ఉపాధ్యక్షులు రామ్మోహన్

ప్రజాశక్తి - సాలూరు

ఏజెన్సీ ప్రాంతంలో గిరిజన విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.రామ్మోహన్ అన్నారు. జిల్లా విద్యారంగం అభివృద్ధికై ఎస్ఎఫ్ఐ చేపట్టిన విద్యార్థి సంగ్రామ సైకిల్ యాత్ర మంగళవారం పట్టణానికి చేరింది. పట్టణంలో ప్రభుత్వ, ప్రయివేటు కళాశాల విద్యార్థులతో కలిసి ప్రధాన రహదారి మీదుగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం బోసుబొమ్మ జంక్షన్ లో విద్యార్థులను ఉద్దేశించి రామ్మోహన్ మాట్లాడుతూ గత ఎన్నికల ముందు సిఎం జగన్ మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయలేదన్నారు. టిడిపి పాలనలో రాష్ట్రం నాశనమైందని, తాను అధికారంలోకి వస్తే అన్ని వర్గాల సమస్యలు పరిష్కరిస్తానని చెప్పారని తెలిపారు. రాష్ట్ర విభజనలో భాగంగా రాష్ట్రానికి రావాల్సిన ప్రత్యేక హెూదా కోసం పోరాడకుండా కేంద్రంలో బిజెపితో వైసిపి దోస్తీ చేస్తోందని చెప్పారు. టిడిపి, జనసేన, వైసిపిలు బిజెపితో అంటకాగుతున్న కారణంగా ప్రధాన సమస్యలు పరిష్కారం కాలేదని చెప్పారు. గడచిన నాలుగేళ్లలో విద్యార్థుల సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నాయని చెప్పారు. విభజన హామీలో భాగంగా మంజూరైన గిరిజన యూనివర్సిటీ శంకుస్థాపనలకే పరిమితమైంద న్నారు. టిడిపి హయాంలో కొత్తవలసలో యూనివర్సిటీకి శంకుస్థాపన చేస్తే వైసిపి ప్రభుత్వం మెంటాడ, దత్తిరాజేరు మండలాల సరిహద్దు ప్రాంతంలో శంకుస్థాపన చేసిందని చెప్పారు. రానున్న ఎన్నికల్లో ప్రభుత్వం మారితే యూనివర్సిటీ ఎక్కడికి వెళ్తుందో చెప్పలేమని అన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పి.రాజశేఖర్ మాట్లాడుతూ గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో కనీస సౌకర్యాలు లేవని చెప్పారు. పెండింగులో ఉన్న ఆశ్రమ పాఠశాలల డైట్ ఛార్జీల బిల్లులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఆశ్రమ పాఠశాలల్లో ఎఎన్ఎంలను నియమించాలని కోరారు. ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. డిఎస్సీ నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు డి.పండు, డివిజన్ కమిటీ నాయకులు పాల్గొన్నారు.

చిట్టీల పేరుతో రూ.కోటికి టోకరా

ప్రజాశక్తి - సాలూరు

చిట్టీల పేరుతో కోటికి రూపాయలకు పైగా డబ్బులకు టోకరా పెట్టిన మహిళ ఉదంతం పట్టణంలో వెలుగులోకి వచ్చింది. పట్టణంలోని మెంటాడ వీధికి చెందిన పంట్ల సరస్వతి అనే మహిళ ఈ ప్రాంతంలో గత కొంతకాలంగా చిట్టీల నిర్వహణ చేస్తుండేది. అయితే గత కొద్ది నెలలుగా చిట్టీలు పాడిన వారికి డబ్బులు ఇవ్వకపోవడంతో అసలు వ్యవహారం బయటకు వచ్చింది. దీంతో ఆమె వద్ద చీటీలు కట్టిన

నిర్వాహకురాలిపై ఫిర్యాదు

మహిళలంతా లబోదిబో అంటూ స్థానిక న్యాయవాది రేగు మహేష్‌ను ఆశ్రయించారు. ఆయన మహిళలతో కలిసి టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయించారు. జిల్లా ఎస్పీకి కూడా ఫిర్యాదు చేశారు. సుమారు కోటిన్నర రూపాయలతో నిర్వాహకురాలు సరస్వతి పరారైనట్లు బాధిత మహిళలు వాపోతున్నారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు.



వీడియో కన్ఫరెన్స్‌లో పాల్గొన్న లెక్టర్ నిశాంత్‌కుమార్; ఐటిడిఎ పిఒలు, డిఆర్ఒ

మార్గదర్శకాలకు అనుగుణం ఓటర్ల జాబితా సవరణ

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణం ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం చేపట్టామని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ తెలిపారు. ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమంపై మంగళవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఓటర్ల జాబితా సవరణపై తీసుకుంటున్న చర్యలు, కొత్త ఇవిఎంల ఏక్సెప్టెన్స్ టెస్ట్ వివరాలు తెలిపారు. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రతి బుధ వారం సమావేశం నిర్వహిస్తూ జిల్లాలో చేపట్టిన ప్రక్రియను వివరిస్తున్నామన్నారు. వారి సూచనలతో పాటు సమస్యలు తెలుసుకొని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు నిమిత్తం ఫారం 6,7,8లు దరఖాస్తులు అందాయని, నిబంధనలకు అనుగుణంగా అన్నింటిని పరిశీలించడం జరిగిందని అన్నారు. ఓటర్ల సవరణలో భాగంగా ఫారం 6,7,8 కింద వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని, డ్రాఫ్ట్ నోటిఫికేషన్ తయారీకి చర్యలు తీసుకోవాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు, పార్వతీపురం, సీతంపేట ఐటిడిఎ పిఒలు సి.విష్ణు చరణ్, కల్పనా కుమారి, డిఆర్ఒ జె.వెంకటరావు, ఆర్‌డిఒ కె.హేమలత తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదపుటంచున పారాది వంతెన

ద్విచక్ర వాహనాలకు మాత్రమే ●అనుమతి మిగతా వాహనాలు దారి మళ్లింపు

ప్రజాశక్తి-బొబ్బిలి

గత కొంతకాలంగా శిథిలావస్థకు చేరి పారాది వంతెన కుంగిపోతోంది. ప్రమాదపు అంచుకు చేరడంతో ముందు జాగ్రత్తగా అధికారులు ద్విచక్ర వాహనాలకు మాత్రమే వంతెన పైనుంచి రాకపోకలకు అనుమతిస్తున్నారు. ఈ నేపథ్యంలో వంతెనను మంగళవారం సాయంత్రం డిఎస్‌పి పి.శ్రీధర్, పట్టణ సిఐ ఎం.నాగేశ్వరరావు పరిశీలించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ వంతెన కుంగిపోవడంతో ప్రమాదాలను నివారించేందుకు వంతెన పైనుంచి ద్విచక్ర వాహనాలకు మాత్రమే రాకపోకలకు అనుమతిస్తున్నట్లు చెప్పారు. విజయనగరం నుంచి బొబ్బిలి వెళ్లే వాహనాలు రామభద్రపురం నుంచి బాడంగి, ముగడ లేదా పినపెంకి మీదుగా, పార్వతీపురం వెళ్లే వాహనాలు రామభద్రపురం నుంచి రాజాం మీదుగా మళ్లిస్తున్నామని చెప్పారు. బొబ్బిలి నుంచి విజయనగరం వెళ్లే వాహనాలను ముగడ లేదా పినపెంకి మీదుగా రామభద్రపురం, పార్వతీపురం నుంచి విజయనగరం వెళ్లే వాహనాలను ఖడ్గవలస మీదుగా దారి మళ్లిస్తున్నామని చెప్పారు. వాహనదారులు గమనించాలని కోరారు.



కూలేందుకు సిద్ధంగా ఉన్న పారాది వంతెన

పరజపాడులో ఏనుగుల సంచారం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

జియమ్మ వలస మండలం రామినాయుడు వలసలో తిష్ట వేసిన 7 అడవి ఏనుగులు మంగళవారం పరజపాడు సమీపంలో సంచరిస్తున్నట్లు అటవీ శాఖ అధికారులు తెలిపారు. ఏనుగుల సంచారంతో సమీప ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. ముఖ్యంగా పంట పొలాలకు వెళ్లే రైతులు ఏనుగుల గుంపు కనిపిస్తే కవ్వింపు చర్యలు చేపట్ట రాదన్నారు. ఏనుగుల సంచారంతో పంట పొలాలు పూర్తిగా నాశనమవుతున్నాయని రైతులు లబోదిబోమంటున్నారు. ఈ ప్రాంతం నుంచి ఏనుగులను తరలించాలని కోరుతున్నారు.



పరపాడ గ్రామ పరిసరాల్లో సంచరిస్తున్న ఏనుగుల గుంపు

ఉంటారా? వెళ్తారా?

ఖాకీ బాస్ కుర్చీ కోసం కుస్తీ

ప్రజాశక్తి - పాలకొండ

పాలకొండ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కుర్చీకోసం సీట్ కోసం గట్టి పోటీ ఉంది. ప్రస్తుతం ఉన్న సిఐ మురళీధర్‌కు బదిలీ అవుతున్నట్టు సమాచారం. అధికార పార్టీ నేతలకు, ఆయనకు మధ్య సఖ్యత కుదరలేదని సమాచారం. ఏడాది క్రితం సిఐగా బాధ్యతలు చేపట్టిన మురళీధర్ అదికార పార్టీకి కొన్ని విషయాల్లో వ్యతిరేకంగా పనిచేశారని, అందువల్ల ఆయన్ని మార్చాలని అధికార పార్టీలో చర్చ జరుగుతున్నట్లు తెలుస్తోంది. అయితే ఇటీవలే 14మంది ఎస్ఐలకు సిఐలుగా ఉద్యోగోన్నతి కల్పించడంతో ఈ ప్రాంతంలో గతంలో ఎస్ఐ గా పని చేసిన ఒక అధికారి సిఐ కుర్చీలో కూర్చోడానికి ప్రయత్నిస్తున్నారని తెలిసింది. నియోజక వర్గ స్థాయిలో ఎమ్మెల్యే సిఫార్సుతో పాటు ఈ ప్రాంతంలో కీలకనేతగా ఉన్న ఎంఎల్‌సి దగ్గరికి కూడా ఆ అధికారి వెళ్లినట్లు సమాచారం. విజయనగరం జిల్లాలో ముఖ్యనేత కూడా ఆ అధికారికి సిఫార్సు చేసినట్లు సమాచారం. ప్రస్తుత సిఐకి ఈ విషయం తెలిసి ఎమ్మెల్యే, ఎంఎల్‌సి దగ్గరికి తనను ఇక్కడ ఉంచేలా కోరినట్లు తెలుస్తోంది. అయితే ప్రస్తుతం ఉన్న సిఐ టీడీపీకి చెందిన ఒక నేతతో సత్సంబంధాలు కొనసాగిస్తూ, అనుకూలంగా పనులు చేస్తున్నారని అధికార పార్టీ వర్గీయు ఆరోపణలు చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ప్రస్తుత సిఐ ఉంటారా లేక బదిలీపై వెళ్తారా అన్న చర్చ జరుగుతుంది.

జగనన్న ఆరోగ్య సురక్షతో అందరికీ వైద్యం

ప్రజాశక్తి - బలిజిపేట

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా గ్రామాల్లో వైద్య సేవలు అందించి ఆరోగ్యకర సమాజానికి కృషి చేస్తుందని కలెక్టర్ నిశాంత్ కుమార్ అన్నారు. మండలంలోని వెంగాపురంలో మంగళవారం నిర్వహించిన జగనన్న సురక్ష వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే అలజంగి జోగారావుతో కలిసి సందర్శించారు. వైద్య శిబిరంలో రోగులకు అందిస్తున్న వైద్య సేవల తీరును పరిశీలించారు. క్రానికల్ డిసీజ్ కేసులు గుర్తించారా, ఎక్కువగా ఏఏ జబ్బులతో రోగులు శిబిరానికి వస్తున్నారని వైద్యులను ప్రశ్నించగా సీజనల్ వ్యాధులపై ఎక్కువ కేసులు నమోదవుతున్నాయని కలెక్టర్‌కు తెలిపారు. వైద్య శిబిరంలో ఏర్పాటు చేసిన పలు విభాగాలను, మందుల నిల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింటికీ వాలంటీర్లు, ఎఎన్‌ఎంల ఆరోగ్య సర్వేతో పాటు గ్రామ సచివాలయ పరిధిలోని సిడి ఎన్సిడి సర్వే జాబితా వివరాలు ఆధారంగా రోగులను గుర్తించి ఏ ఒక్కరూ వైద్యానికి దూరం కాకుండా మెరుగైన వైద్యం అందించాలన్నారు. ఆరోగ్యశ్రీ కింద అత్యవసర పరిస్థితుల్లో అందుబాటులో ఉన్న ఆసుపత్రులపై శిబిరానికి వచ్చే రోగులకు అవగాహన కల్పించాలని సూచించారు. శిబిరానికి వచ్చే వారికి అవసరమైన ఆరోగ్య చికిత్సలతో పాటు మనోధైర్యాన్ని నింపాలన్నారు. అనారోగ్యంతో అధిక డబ్బులు ఖర్చుపెట్టి కుటుంబాలు ఆర్థికంగా చితికిపోకూడదన్న ఉద్దేశంతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం గ్రామాల్లో నిర్వహిస్తుందని అన్నారు. అక్కడ ఉన్న వృద్ధురాలితో వైద్య సేవలు అందుతున్న ఆరా తీయగా గ్రామంలో నిపుణులైన వైద్యులు అందుబాటులో ఉండి సేవలు అందిస్తుండడంతో ఎవరి అవసరం లేకుండా వైద్య పరీక్షలు కోసం శిబిరానికి స్వయంగా వచ్చానని ఆమె బదులిచ్చారు. ఎంపిపి జి.నాగమణి, సర్పంచ్ జి.అమ్మడమ్మ, ఎంపిటిసి సభ్యులు జి.మురళి, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ టి.జగన్మోహన్‌రావు, తహశీల్దార్ అప్పారావు, వైద్యులు డి.కిరణ్మయి, ఎల్. సందీప్, తదితరులు పాల్గొన్నారు.

భామిని : భామిని, బత్తిలి పి హెచ్ సి వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో మండలంలోని బొడ్డగూడ పంచాయతీలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారులు డాక్టర్ ఫణికుమార్, డాక్టర్ సోయల్, కొండపల్లి రవీంద్ర రోగులకు వైద్యపరీక్షలు చేశారు. ఇదిలా ఉండగా ఐటిడిఎ పిఒ కల్పన కుమారి హెల్త్, పోషకాలు కూడిన స్టాళ్లను పరిశీలించారు. అనంతరం అందిస్తున్న వైద్య సేవలు, మందులు పరిశీలించారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ అప్పారావు, ఎంపిపి ప్రతినిధి తోట సింహాచలం, జెసిఎస్ కో ఆర్డినేటర్ కొత్తకోట చంద్రశేఖర్, తహశీల్దార్ ఎన్.అప్పారావు, ఎంపిడిఒ జి.చంద్రరావు, మాణిగ సర్పంచ్ కొండగొర్రి చంటి, బొడ్డగూడ సర్పంచ్ అనంతరావు, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.



సీతంపేట : వైద్యాధికారులతో మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ కల్పనాకుమారి

సీతానగరం : మండలంలోని అంటిపేట సచివాలయం పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు వైద్యశిబిరాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో డిఎంహెచ్ఒ డాక్టర్ బి.జగన్నాథరావు, జెడ్పీటీసీ మామిడి బాబ్జీ, ఎంపిపి ప్రతినిధి బలగ శ్రీరాములు నాయుడు, సీనియర్ నాయకులు పోల ఈశ్వర నారాయణ, మాజీ జెడ్పీటీసీ అంబటి కృష్ణంనాయుడు, స్థానిక సర్పంచ్ బొంగు తిరుపతి రావు, ఎంపీటీసీ ఎస్.నిర్మల, ఎంపిడిఒ, తహశీల్దార్, పలుశాఖల అధికారులు, వైద్యసిబ్బంది, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

వీరఘట్టం: మండలంలోని చలివేంద్రలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి బి.జగన్నాథరావు జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని సందర్శించి వైద్యంపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపిపి డి.వెంకటరమణనాయుడు, మండల ప్రత్యేక అధికారి పి.కిరణ్‌కుమార్, తహశీల్దార్ సిహెచ్ సత్యనారాయణ, ఎంపిడిఒ జిజె ప్రసాద్, సర్పంచ్ ఎస్.సుదర్శనరావు, ఎంపిటిసి పోరెడ్డి వెంకటనాయుడు, సచివాలయ కార్యదర్శి శ్యాం, విఆర్ఒ రఘు, వైద్య, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

గరుగుబిల్లి: మండలంలోని గొట్టివలసలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే పి.పుష్పశ్రీవాణి, వైసిపి జిల్లా అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షిత్ రాజు, ఎంపిపి ఉరిటి రామారావు, ఉమ్మడి జిల్లాలజిల్లాపరిషత్తు వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు వైద్యపరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బగాది జగన్నాథరావు, జి.పైడితల్లితది తరులు పాల్గొన్నారు.

సాలూరు రూరల్ : మండలంలోని నెల్లిమర్ల, జీగిరాంలో జగనన్న ఆరోగ్య సురక్ష క్యాక్రమం నిర్వహించారు. వైస్ ఎంపిపి రెడ్డి సురేష్, వైసీపీ మండల అధ్యక్షులు సువ్వాడ భరత్ శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ శిబిరంలో 650మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు మామిడిపల్లి పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ కనకాల శ్రీకాంత్ తెలిపారు. కార్యక్రమంలో జీగిరాం సర్పంచ్ అల్లు సుభాషిణి, నెలిపర్తి సర్పంచ్ ప్రతినిధి వేణు, ఎంపిటిసి సభ్యులు సురాప్పల నాయుడు, వైద్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



బలిజిపేట :పౌష్టికాహార స్టాల్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్



గరుగుబిల్లి : వైద్యాధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి



దరఖాస్తులను పరిశీలిస్తున్న ప్రిన్సిపల్ గంగస్వామి

పాలిటెక్నిక్‌లో స్పాట్ అడ్మిషన్లు

ప్రజాశక్తి - సీతంపేట

జిఎంఆర్ పాలిటెక్నికల్ కళాశాలలో ప్రవేశాలకు మంగళవారం స్పాట్ అడ్మిషన్లు ప్రిన్సిపల్ డాక్టర్ డిఆర్ఎస్ గంగస్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ అడ్మిషన్లకు పాలిసెట్ అవసరం లేదన్నారు. స్పాట్ అడ్మిషన్లు అయిన విద్యార్థులకు ప్రభుత్వ రాయితీలు వర్తించవని అన్నారు. సివిల్, మెకానికల్ ఇంజనీరింగ్ తదితర కోర్సులు లభించబడుతుందని తెలిపారు. విద్యార్థులకు న్యాయమైన విద్య అందిస్తున్నామని తెలిపారు. స్పాట్ స్పేస్ కట్టి జాయినింగ్ అయ్యారని తెలిపారు. ఈ అడ్మిషన్ల ప్రక్రియలో ఉపాధ్యాయులు, తదితరులు ఉన్నారు



కాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం

కంపు కొడుతున్న కాలువలు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

మున్సిపల్ వైస్ చైర్మన్‌గా ఇందుపూరు గున్నేష్ ఏకగ్రీవంగా ఎన్నికైన 27వ వార్డు శిరేల వీధిలోనే సమస్యలు తాండవిస్తున్నాయి. ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న మురుగు కాలువల్లో చెత్త, వ్యర్థాలు పేరుకుపోయి వాడుక నీరు వెళ్లేందుకు దారి లేక కంపుకొడుతుంది. దీంతో స్థానికులతో పాటు ఆ రహదారి గుండా రాకపోకలు సాగించే పాదాచారులు, ద్విచక్ర వాహన చోదకులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై స్థానిక మున్సిపల్ ప్రజారోగ్య అధికారులు గానీ, ఆ వార్డు సచివాలయ శానిటరీ కార్యదర్శి గానీ పర్యవేక్షణ చేసి పారిశుధ్య కార్మికులచే కాలువలను శుభ్రపరచేందుకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

మహిళా మార్టు పరిశీలన

ప్రజాశక్తి - వీరఘట్టం

మండల కేంద్రంలోని మండల మహిళా సమైక్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న మహిళా మార్ట్ కేంద్రాన్ని మంగళవారం డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ పి.కిరణ్‌కుమార్ పరిశీలించారు. మార్టులో జరుగుతున్న పనులను క్షుణ్ణంగా పరిశీలించి పనులు వేగవంతం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. పిడితోపాటు ఎపిఎం బిబి శివున్నాయుడు ఉన్నారు.

కేదారి పురంలో గ్రామసభ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని కేదారిపురంలో మంగళవారం సర్పంచి టి.తులసమ్మ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. గత మూడు నెలల్లో గ్రామపంచాయతీ పరిపాలలో భాగంగా చేసిన జమ, ఖర్చు వివరాలు, తీర్మానాలు ప్రజలకు తెలియజేసి ఆమోదించారు. 2024 -25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉపాధిహామీ లేబర్ బడ్జెట్‌పై, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జరిగిన పనులపై చర్చించారు. కొత్త పిఎంఎవై ఇళ్ల గుర్తింపు, ప్రస్తుత పురోగతి మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయం పద్ధతులు, వర్మీకంపోస్ట్ సేంద్రియ ఎరువు తయారు చేయు విధానంపై వివరించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, చట్టాలపై అవగాహన కల్పించారు. పంచాయతీలో పనిచేస్తున్న గ్రీన్ అంబాసిడర్లను సన్మానించారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామ సచివాలయం ఉద్యోగులు, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లు, వాలంటీర్లు పాల్గొన్నారు.

రోడ్డుకిరువైపులా పిచ్చిమొక్కలు తొలగింపు

ప్రజాశక్తి -గరుగుబిల్లి

మండలంలోని ఖడ్గవలస నుండి తోటపల్లి వరకు రహదారికి ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలను మంగళవారం జెసిబి సాయంతో మొక్కలను తొలగించే కార్యక్రమం నిర్వహించినట్టు ఎస్సై రాజేష్ తెలిపారు. ప్రమాదాలకు మూల కారణం ఈ చెట్లు, పొదలు వల్ల ఎదురుగా వస్తున్న వాహనాలను గమనించకపోవడంతో ద్విచక్ర వాహనదారులు, భారీ వాహనాలు నిత్యం తిరుగుతున్న రహదారి కావడంతో ప్రమాదాలను అరికట్టేందుకు ఈ కార్యక్రమం చేపట్టినట్టు తెలిపారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు డోకిశీల విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

మండలంలోని డోకిశీల గిరిజన సంక్షేమ ఉన్నత పాఠశాలకు చెందిన నిమ్మక ప్రవీణ్ రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్టు పాఠశాల ప్రాజెక్టు డైరెక్టర్ మంతిని వాసుదేవరావు మంగళవారం తెలిపారు. త్వరలో కడప జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో అండర్-17 విభాగంలో ప్రాతినిధ్యం వహిస్తాడని తెలిపారు. విద్యార్థి ఎంపిక పట్ల పిఇటి ఎజిఎస్ దుర్గాప్రసాద్, వార్డెన్ రమేష్‌తో పాటు ప్రధానోపాధ్యాయులు గోవిందరావు, ఉపాధ్యాయ సిబ్బంది ఆనందం వ్యక్తం చేశారు.

తలవరం విద్యార్థికి బంగారు పతకం

ప్రజాశక్తి - వీరఘట్టం



బంగారు పతకం సాధించిన భవనకృతి

మండలంలోని తలవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న పి.భవనకృతి గోల్డ్ మెడల్ సాధించినట్లు ప్రధానోపాధ్యాయులు యు.అప్పారావు మంగళవారం తెలిపారు. నంద్యాలలో రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బాల్ బ్యాడ్మింట్ పోటీలో తమ సత్తా చాటి పాఠశాలకు పేరు ప్రఖ్యాతులు తెచ్చి పెట్టిన భవనకృతికి వ్యాయమ ఉపాధ్యాయులు ఎం.రామకృష్ణ, వై.ధనలక్ష్మితోపాటు ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు, అభినందించారు.

విజయదశమి ఉత్సవాలకు ఏర్పాట్లు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఈ ఏడాది గుమ్మలక్ష్మీపురంలో విజయదశమి ఉత్సవాల ఏర్పాట్లకు సన్నాహాలు చేస్తున్నారు. సర్పంచి బి.గౌరీశంకర్‌తో మోటార్ యూనియన్ సభ్యులతో మంగళవారం సమావేశమయ్యారు. కార్యక్రమం లో వైస్ ఎంపిపి నిమ్మక శేఖర్, వర్తక సంఘం అధ్యక్షులు కొత్త కోట విష్ణు, రిటైర్డ్ ప్రధాన ఉపాధ్యాయులు, గ్రామస్తులు ఉన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం

ప్రజాశక్తి వీరఘట్టం

మండలంలోని విక్రంపురం గ్రామ సర్పంచి సర్పంచ్ మాచర్ల మహేశ్వరరావు, గ్రామ పెద్దల ఆధ్వర్యాన రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత సాకేటి రాంబాబుకు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రాంబాబును శాలువాతో సన్మానించి జ్ఞాపికను అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థులకు మెరుగైన విద్యాబుద్ధిలు నేర్పించి వారిని ఉన్నతులుగా తీర్చిద్దేలా మరికొంతమందికి మార్గదర్శకంగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు మాచర్ల వెంకటరమణ, గీతానందీశ్వరరావు, విశ్వేశ్వరరావు గ్రామస్తులు పాల్గొన్నారు.

చంద్రబాబు అరెస్టుపై కొనసాగుతున్న నిరసనలు

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

టిడిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అరెస్టుకు నిరసనగా ఆ పార్టీ ఆధ్వర్యంలో జరగుతున్న నిరసనలు మంగళవారం కూడా కొనసాగాయి. టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బోనెల విజయచంద్ర, మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్ ఆధ్వర్యంలో మంగళవారం పార్టీ కార్యాలయం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకూ ర్యాలీగా వెళ్లి వినతి సమర్పించారు. అనంతరం బైపాస్‌రోడ్‌లో షిర్డీ సాయి మందిరంలో బాబా విగ్రహానికి వినతి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రశ్నించే గొంతులు నొక్కినంత మాత్రన ప్రభుత్వ వైఫల్యాలు దాగిపోతాయనుకోవడం భ్రమ అని, చంద్రబాబుకు న్యాయం జరిగి మచ్చలేని చంద్రునిలా తిరిగి వచ్చేంత వరకూ ఆయనకు జరిగిన అన్యాయాన్ని ప్రజల్లో ఎండగడతామని తెలిపారు. కార్యక్రమంలో మండల, పట్టణ పార్టీ అధ్యక్షులు దొగ్గ మోహనరావు, జి.రవికుమార్, నాయకులు గొట్టాపు వెంకటనాయుడు, బోను చంద్రమౌళి, జాగాన రవికుమార్, కౌన్సిలర్లు బి.గౌరినాయుడు, కోల మధుసరిత, తాతపూడి వెంకటరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టిడిపి, జనసేన రిలే నిరాహార దీక్షలు

సీతంపేట : చంద్రబాబునాయుడి అక్రమ అరెస్టు, పార్టీ శ్రేణులపై జరిగిన దమనకాండ, జగన్ రెడ్డి కక్షపూరిత రాజకీయాలకు నిరసనగా బాబుతో నేను కార్యక్రమం టిడిపి మండల పార్టీ అధ్యక్షులు సవరతోట మొఖలింగం, జనసేన మండలం అధ్యక్షులు మండంగి విశ్వనాథం ఆధ్వర్యంలో సీతంపేటలో మంగళవారం సామూహిక రిలే నిరాహారదీక్షలు చేపట్టారు. కార్యక్రమంలో ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి బిడ్డిక చంద్రరావు, ఐటిడిపి కోఆర్డినేటర్ హిమరక పవన్, బిడ్డిక అప్పారావు, స్వామినాయుడు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పార్వతీపురం : అంబేద్కర్ విగ్రహానికి వినతిని అందజేస్తున్న టిడిపి నాయకులు

గుమ్మలక్ష్మీపురం : టిడిపి అధినేత చంద్రబాబు ను అక్రమంగా అరెస్టు చేశారని కురుపాం నియోజకవర్గం ఇంచార్జి తోయక జగదీశ్వరి అన్నారు. బాబుతో నేను అనే కార్యక్రమంలో భాగంగా ఇరిడి పంచాయతీ గాజులు గూడ, జల్లగూడ గ్రామాలలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు అడ్డాకుల నరేష్, బిడ్డిక శరత్, సొంటేన రాజేష్, తాడంగి రామారావు ఉన్నారు. అలాగే జియ్యమ్మవలస మండలం చినకుదమలో బాబుతో నేను కార్యక్రమం కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమం లో అరుకు పార్లమెంట్ అధికార ప్రతినిధి డొంకాడ రామకష్ణ, మండల అధ్యక్షులు పల్ల రాంబాబు, ఎంపిపి బొంగు సురేష్, సర్పంచ్ చెరుకుబిల్లి గిరి తదితరులు ఉన్నారు.

చలో ఢిల్లీ జయప్రదం చేయండి

ప్రజాశక్తి - కొమరాడ



వినతిని అందజేస్తున్న ఆశాలు, సిహెచ్‌డబ్ల్యులు

ఆశా, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు తమ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 30న తలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమానికి పెద్ద ఎత్తున కదలి రావాలని సిఐటియు నాయుకులు కొల్లి సాంబమూర్తి అన్నారు. మంగళ వారం రామభద్రపురం, మాదలంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వద్ద కొమరాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద నిరసన చేపట్టారు. అనంతరం పిహెచ్ఒ ఆర్.బంగారుబాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, రాజకీయ వేధింపులు ఆపాలని, టిఎ,డిఎలు ఇవ్వాలని ప్రసూతి సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఐడెంటిటీ కార్డులు ఇవ్వాలని, వేతనంతో కూడిన సెలవులు ఇవ్వాలని, పని భారం తగ్గించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్ల ఇవ్వాలని బడ్జెట్లో నిధులు పెంచాలని, యూనిఫారం నాలుగు జతలు ఇవ్వాలని కోరారు. వీటితో పాటు మరికొన్ని సమస్యలు పరిష్కారం చేయాలని కోరుతూ ఈనెల 30న ఆశా, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లంతా కలిసి చలో ఢిల్లీ కార్యక్రమానికి పెద్ద ఎత్తున కదిలి రావాలని నాయకులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆశా, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు గుంపమ్మ, ఎల్లమ్మ, మల్లమ్మ, అంకమ్మ, చంద్రమ్మ, చిన్నమ్మి, పద్మ, సునీల, లక్ష్మి, హేమలత, పలువురు ఆశా, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు పాల్గొన్నారు.

మండల మహిళా సమైక్య అధ్యక్షులుగా సుజాత

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక మండల మహిళా సమైక్య కార్యాలయంలో మంగళవారం గ్రామ సంఘాల ప్రతినిధులతో నిర్వహించిన ఎన్నికలో మండల మహిళా అధ్యక్షులుగా పెరుమాల సుజాతను ఏకగ్రీవంగా ఎన్ను కున్నారు. ఉపాధ్యక్షులుగా బొబ్బది చందనమ్మ, కార్యదర్శిగా కందుల ఉషారాణి, ఉప కార్యదర్శిగా గొల్ల సింహాద్రమ్మ, కోశాధికారిగా మత్స భాగ్యలక్ష్మిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు మహిళా అధ్యక్షులు సుజాతకు, కార్యవర్గానికి ఎపిఎం బి.శివున్నాయుడు, కార్యాలయ సిబ్బంది ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సుజాత మాట్లాడుతూ సంఘాల బలోపేతానికి తమ వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

పోలీసు చట్టాలపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

స్థానిక సురేష్ పబ్లిక్ స్కూల్‌లో విద్యార్థులకు మంగళవారం దిశా ఎస్ఐ లావణ్య అధ్వర్యంలో చెడు స్పర్శ, మంచి స్పర్శకు గల తేడాలు గురించి అవగాహనా కల్పించారు. అలాగే ఆర్‌కె జూనియర్ కాలేజీలో విద్యార్థులకు దిశా యాప్, సైబర్ నేరాలు, మహిళలకు ఉపయోగపడే చట్టాలు తదితర అంశాలపై అవగాహన కల్పించి తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బందితో పాల్గొన్నారు.

శంబరలో గడపగడపకు మన ప్రభుత్వం

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని శంబరలో మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ప్రతి గడపకు డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సేవలను ప్రజలకు వివరించారు. అలాగే ప్రజలకు మెరుగైన వైద్య సౌకర్యాన్ని అందించాలనేఉద్దేశంతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామంలో గడపగడపకు వైద్య సిబ్బందిని పంపించి వైద్య సేవలను అందిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో వైసిపి మండల నాయకులు ఎం.రంగునాయుడు, జెడ్పిటిసి సభ్యులు శ్రీనివాసరావు, ఇతర మండల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

పాలకొండ : పట్టణంలోని 15, 16 వార్డుల్లో వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఎమ్మెల్యే విస్వసరాయి కళావతి చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె ఇంటింటికీ వెళ్లి సమస్యలని అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు అండగా ఈ ప్రభుత్వం ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీని గెలిపించాలన్నారు. ఎంఎల్‌సి పాలవలస విక్రాంత్ మాట్లాడుతూ ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత ఈ ప్రభుత్వందే అన్నారు. కార్యక్రమంలో నగరపంచాయితీ వైస్ చైర్మన్ రౌతు హనుమంతు రావు, పల్లా ప్రతాప్, విశ్రాంతి కమిషనర్ లిల్లీ పుష్పనాథం, కౌన్సిలర్స్ వెలమల మన్మధ రావు, దుప్పాడ పాపినాయుడు, గంగు నాయుడు, కడగల రవణ, టి. శంకర్, నీలాపు శ్రీను, కొంచాడ అరుణ తదితరులు ఉన్నారు.



బుక్‌లెట్‌ను అందజేస్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

రోడ్డుకిరువైపులా మొక్కలు తొలగించాలి

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

మండలంలోని వెంకంపేట నుంచి ఆంధ్రా ఒడిషా రహదారి, రంగాలగూడ నుండి నారాయణపట్నం రహదారికి ఇరువైపులా దట్టంగా పెరిగిన మొక్కలు రాకపోకలకు అంతరాయంగా మారి వాహనచోదకులకు ప్రమాదానికి గురిచేస్తున్నాయని, వెంటనే వాటిని తొలగించాలని రావికోన సర్పంచ్ కె.రామస్వామి ఆర్ అండ్ బి అధికారులను కోరారు. ఈ మేరకు మంగళవారం వినతి అందించారు. అనంతరం ఆయన మాట్లాడు తూ రంగాలగూడ నుండి ప్రధాన రహదారికి చేరుకోవడానికి పిచ్చిమొక్కలు అంతరాయం కలిగిస్తున్నాయని, రహదారి మలుపులో తరచూ వాహన చోదకులు, పాదాచారులు ప్రమాదాల బారిన పడుతున్నారని తెలిపారు.

ప్రకృతి సేద్య కషాయాల తయారీ

ప్రజాశక్తి - పాచిపెంట

మండలంలోని గోగాడవలస, గురువు నాయుడుపేటలో సిఆర్పిలు శ్రీనివాసరావు, తిరుపతినాయుడు ఆధ్వర్యంలో దశపత్ర, పంచపత్ర, జిల్లేడు కషాయం, పేడ మూత్రం ఇంగువ ద్రావణాలను తయారు చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన మండల వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో పర్యావరణానికి ఎలాంటి హాని జరగకుండా చీడిపేడలను నివారించుకునేందుకు ప్రకృతి సేద్య కషాయాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. పొటాష్ ఎరువుకు ప్రత్యామ్నాయంగా జిల్లేడు ద్రావణం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అనంతరం పాంచాలి, గురువు నాయుడుపేట గ్రామాలను ప్రకృతి సేద్య గ్రామాలుగా 2023 రబీ సీజన్ నుంచి కార్యక్రమాల విస్తరణ జరుగుతుందని తెలిపారు.

రోడ్డు విస్తరణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని ఉదయపురం పంచాయతీలో పలు గిరిజన గ్రామాలకు రూ.63లక్షలతో మంజూరై రహదారి విస్తరణ పనులకు మంగళవారం ఎమ్మెల్యే పాముల పుష్ప శ్రీవాణి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉదయపురం కాలనీ నుండి దాసుగూడ వరకు కిలోమీటరు రోడ్డుకు రూ.8లక్షలు, కాకితాడ నుంచి జురుడుగూడ వరకు 2.80 కిలోమీటర్లు రూ.24 లక్షలతో, కొత్తగూడ నుండి మల్లుగూడ వరకు ఒక కిలోమీటరు రూ.8 లక్షలతోనూ, కొత్తగూడ నుండి కంటుగూడ వరకు 2.70 కిలోమీటర్లు రూ.23 లక్షలతో మొత్తం 7.50 కిలోమీటరుల రూ.63 లక్షలతో రహదారి విస్తరణ పనులకు నిధులు మంజూరయ్యావని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి శెట్టి పద్మావతి, వైస్ ఎంపిపి రంగారావు, వైసిపి గ్రీవెన్స్ జిల్లా అధ్యక్షులు శెట్టి నాగేశ్వరరావు, మండల కన్వీనర్ ఐ. గౌరీ శంకర్ , సర్పంచులు, ఎంపీటీసీలు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి



కళాకారులు ప్రదర్శిస్తున్న నాటకం

ప్రజా జీవనంపై నాటికల ప్రభావం

కురుపాం : నాటికల ప్రభావం ప్రజలపై పడితే ప్రజా జీవితాలు మారుతాయని వైసిపి మన్యం జిల్లా అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షిత్ రాజు అన్నారు. పెదమేరంగిలో చివరిరోజు నాటికి పోటీలకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నాటిక సామాజిక చైతన్యం తెచ్చే రీతిలో ఉన్నాయని మన సమాజంలో జరుగుతున్న వాస్తవాలను నాటకంలో వ్యక్తీకరించి ప్రజలకు తెలియజేయడమే ప్రజల చైతన్యానికి నాటికలు ఎంతో ఉపయోగకరమని అన్నారు. అనంతరం నాటిక పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత ఎం.భూపాల్‌రెడ్డి, జట్టు వ్యవస్థాపకులు డి.పారి నాయుడు, సొంటినేని కిషోర్, రౌతు వాసుదేవరావు, రౌతు విజయ్ కుమార్, రౌతు అజయ్‌కుమార్, దాసరి రాజేంద్ర కుమార్, గొట్టిపల్లి రామచంద్రారావు, వాన నారాయణరావు, పోల గోవిందరావు, మరడాన కిషోర్ కుమార్, బలగ వెంకటరమణ, దాసరి శేషగిరిరావు పాల్గొన్నారు.

పంటలపై యాజమాన్య పద్ధతులు

సీతంపేట : మండల కేంద్రమైన సీతంపేట పాత పనుకువలస సమీపంలో ఉన్న ఎన్జీరంగా విశ్వవిద్యాలయం వ్యవసాయ పరిశోధన స్థానంలో మంగళవారం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ పి.సీతారాం వివిధ పంటల యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. శ్రీకాకుళం జిల్లా వ్యవసాయ సాంకేతిక ఆత్మ సహకారంతో వీరఘట్టం, సీతంపేట మండలాల్లో ఔత్సాహిక రైతులకు చిరుధాన్యాలు, పత్తి పంటలపై నాణ్యమైన పంట దిగుబడిపైనా, భూసారం, అధిక దిగుబడులపైనా, చీడ పీడిల తొలగింపుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆత్మ ప్రాజెక్ట్ డైరెక్టర్ రామచంద్రరావు, విడిఎ కృష్ణారావు, రత్నకుమారి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు శారద, ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు జిల్లా మేనేజర్ షణ్ముఖ రాజు శాస్త్రవేత్త లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సిహెచ్‌డబ్ల్యుల నియామకంలో ఇదేమి న్యాయం?

ఆదివాసీ గిరిజన సంఘం

ప్రజాశక్తి -సాలూరురూరల్

మండలంలోని బాగువలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఆరు పంచాయతీల్లో 32 గ్రామాలుంటే నాలుగు గ్రామాల నుంచి నలుగుర్ని సిహెచ్‌డబ్ల్యులుగా నియమించడం దారుణమని ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు విమర్శించారు. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన నాయకులు కునేటి గాసీ, చినబాబు మాట్లాడుతూ బాగువలస పిహెచ్‌సిలో 32 గ్రామాల పరిధిలో ఉందని, ఇన్ని గ్రామాలున్నా కనీసం ఎవరికీ తెలియజేయకుండా కేవలం నాలుగు నుండి నలుగుర్ని ఎంపిక చేయడం వల్ల ఎవరికి లబ్ధిపొందాలని చూస్తున్నారని అన్నారు. దీని వెనుక ఎవరెవరు ఉన్నారని, దీనివల్ల వారికి ఎంత లాభం చేకూరుతుందని విషయాలతో సంబంధిత ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. అన్ని గ్రామాల్లో అర్హులైన గిరిజన యువతీ, యువకులకు అవకాశం కల్పించాలని కోరుతూ స్థానిక వైద్యాధికారి రవికిరణ్‌కు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన నాయకులు చిక్కుడు, బింగు, అప్పారావు పాల్గొన్నారు.



సామూహిక సీమంతాలు నిర్వహిస్తున్న ఐసిఐఎస్ సిబ్బంది

ఐసిడిఎస్ ఆధ్వర్యంలో సామూహిక సీమంతాలు

ప్రజాశక్తి - గరుగుబిల్లి

గర్భిణీలు, బాలింతల్లో రక్తహీనత నివారించేందుకు అంగన్వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం పంపిణీ చేస్తున్నట్టు కొమరాడ ఐసిడిఎస్ పిఓ గొట్టాపు సుగుణ కుమారి అన్నారు. మండలంలోని గొట్టివలసలో మంగళవారం ఐసిడిఎస్ ఆధ్వర్యంలో గర్భిణీలకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు గాజులు, జాకెట్ ముక్కలు, పళ్లు, స్వీట్లు అందజేశారు. అనంతరం పిఓ మాట్లాడుతూ గర్భిణీలు అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందజేస్తున్న పౌష్టికాహారం ప్రతిరోజువిధిగా తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిడిఓ జి.పైడితల్లి, వైద్యాధికారి డాక్టర్ పిఎ ప్రియాంక, హెచ్‌వి చింతాడ ఉదయకుమారి, సూపర్వైజర్లు లక్ష్మి, పి.అరుణకుమారి, అంగన్వాడీ వర్కర్లు పాల్గొన్నారు



గిరిజనులతో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు ఈశ్వరరావు

గిరిజన చట్టాలను కాపాడుకోవాలి

ప్రజాశక్తి - కురుపాం

గిరిజన చట్టాలను కాపాడుకోవాల్సిన బాధ్యత గిరిజనులదేనని సిపిఎం నాయకులు కోరాడ ఈశ్వరరావు అన్నారు. మండలంలోని పెద గొత్తిలి పంచాయతీ కైరాడ గిరిజన గ్రామంలో ఆదివాసీ గిరిజన సంఘం ప్రతినిధి బిడ్డికి మంగధ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈశ్వరరావు మాట్లాడుతూ జీవో 3 కొనసాగించి గిరిజన యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, బోయ, వాల్మీకులను ఎస్‌టిలో చేర్చే ఆలోచనపై రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా నిరసన చేపట్టాలని పిలుపునిచ్చారు. బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత పోరాడి సాధించుకున్న గిరిజన చట్టాలు, హక్కులను కాలరాస్తున్నారని, వన సంరక్షణ పేరుతో గిరిజనులను అడవుల నుంచి దూరం చేసే ఆలోచన చేస్తూ చట్టాన్ని నిర్వీర్యం చేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. జిఒ 3ను కొనసాగించాలని, గిరిజన యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాల డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గిరిజన సంఘం ప్రతినిధులు బి.ఎంకన్న, ఊయక శంకర్రావు, బి.తురకన్న పాల్గొన్నారు.

సిరిమాను సంబరాలకు నేడు పందిరిరాట

విజయనగరం టౌన్ : అక్టోబరు 29 నుంచి 31 వరకు నిర్వహించనున్న శ్రీ పైడితల్లి అమ్మవారి సిరిమాను ఉత్సవాలకు బుధవారం ఉదయం పందిరిరాట కార్యక్రమంతో అంకురార్పణ చేయనున్నట్టు ఆలయ ఇఒ కెఎల్ సుధారాణి తెలిపారు. ఉదయం 8.30 గంటలకు దీక్షధారణ కార్యక్రమం చదురుగుడి ఆలయం వద్ద జరుగుతుందని, అనంతరం 9.30 గంటలకు చదురుగుడి వద్ద, 11గంటలకు వనంగుడి వద్ద పందిరిరాట కార్యక్రమం ఆలయ సంప్రదాయాల మేరకు నిర్వహించ నున్నట్టు తెలిపారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్



మృతి చెందిన పైడయ్య

మండలం లోని పెదబొండపల్లికి చెందిన సవరపు పైడియ్య (64) అనే వ్యక్తి అదే గ్రామానికి చెందిన తామర చెరువులో స్నానానికి దిగి చనిపోయినట్లు స్థానికులు తెలిపారు. మంగళవారం ఉదయం చెరువులో తేలిన శవం కలకలం సృష్టించగా, గ్రామస్థుల ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు వెలికితీశారు. పైడియ్యగా గుర్తించారు. మృతునికి భార్య, ముగ్గరు కుమార్తెలు ఉన్నారు. రూరల్ ఎస్.సింహాచలం కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లారీ ఢీకొని ఒకరు మృతి

మరొకరికి గాయాలు

ప్రజాశక్తి - సీతానగరం



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలరాజు

మండలంలోని మరిపివలస వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరికొకరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానిక పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

నేరాలు ఘోరాలు

మండలంలోని పెదభోగిలికి చెందిన మర్రి బాలరాజు, యజ్జల బుజ్జి బైక్‌పై మంగళవారం సొంత పనుల నిమిత్తం ద్విచక్రవాహనంపై కొమరాడ వెళ్లారు. తిరిగి పనిముగించుకుని స్వగ్రామానికి వస్తుండగా మరిపివలస దగ్గర ఎదురుగా వస్తున్న లారీ ఢీకొనడంతో బుజ్జి(40) తలకు గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందగా, తీవ్రంగా గాయపడిన బాలరాజును పార్వతీపురం జిల్లా కేంద్ర అసుపత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఔట్‌పోస్టు పోలీసులు వివరాలు నమోదు చేశారు.

బాలికపై అత్యాచారం కేసులో ముద్దాయికి జైలుశిక్ష

ప్రజాశక్తి- పార్వతీపురంరూరల్

సీతంపేట మండలం సోమగండికి చెందిన బాలికపై ఏప్రిల్ 2018లో ఆత్యాచారం చేసిన సంఘటనలో అదే గ్రామానికి చెందిన గంటా సంతోష్‌కుమార్‌కు శ్రీకాకుళం న్యాయస్థానం 20ఏళ్ల జైలుశిక్ష, రూ.5వేల జరిమాన విధించినట్లు జిల్లా ఎస్పీ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. బాధితురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు ముద్దాయిపై పోక్సో చట్టంతో పాటు పలు, కేసులు పెట్టగా, నేరం రుజువైనందున అక్టోబర్ 3న తీర్పు వెలువరించారని పేర్కొన్నారు. బాధితురాలికి న్యాయం స్థానం రూ.4లక్షల నష్టపరిహారం ప్రకటించిందని ప్రకటనలో తెలిపారు. ఈ కేసు పరిష్కారానికి చొరవచూపిన సీతంపేట ఎస్ఐ ఎ.నీలకంఠరావు, ఎఎస్ఐ ఎస్.శ్రీనివాసరావు, పిసి ఇవిజి నాయుడులతో పాటు, ఫిర్యాదు తరపున వాధించిన పోక్సో పిపి కెశంకరరావు, రమణ, సిబ్బందిని ఎస్‌పి విక్రాంత్‌పాటిల్ అభినందించారు.